క్లుప్తంగా

హైదరాబాద్‌కు తరలిన ఉపాధ్యాయులు

కొత్తకోట రూరల్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి మండలంలోని తపస్ సభ్యులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నుంచి స్పందన వస్తుందని తపస్ జిల్లా అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విష్ణువర్ధన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శివవర్ధన్‌రెడ్డి, శివనారాయణ, దేవన్న ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



పాన్‌గల్: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన బొజ్జమ్మకు మంజూరైన రూ.10 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. సీఎం సహాయనిధితో పేదలకు కార్పొరేటు ఆస్పత్రుల్లో వైద్యం అందుతుందన్నారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి, ప్రజాప్రతినిధులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీరసాగర్, దాసునాయక్, నాగరాజు, దామోదర్‌రెడ్డి, పీర్యానాయక్, హన్మంతు, వెంకట్‌రెడ్డి, బిచ్చన్న, వంశీరెడ్డి, బీమ్‌సాగర్, చంద్రాయుడు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హర్షవర్ధన్‌రెడ్డికి టికెట్ ప్రకటనపై హర్షం



వీపనగండ్ల: కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి బీఆర్‌ఎస్ టికెట్ కేటాయించడంపై పలువురు ప్రజాప్రతినిధులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి మరోసారి గెలుపొందడం ఖాయమని ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, రాము, సర్పంచ్‌లు రఘునాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్, చంద్రకళ, అరుణమ్మ, రామేశ్వర్‌రావు, వేముల సుజాత పేర్కొన్నారు.
పాన్‌గల్: కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి టికెట్ కేటాయించడంతో జిల్లా నాయకులు రవికుమార్, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమ్‌నాథ్‌నాయక్‌లు సోమవారం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో మారోసారి బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సర్పంచ్ రామ్‌లాల్ పాల్గొన్నారు.

పట్టాభూమిని వక్ఫ్‌బోర్డు నుంచి తొలగించండి

అమరచింత: పట్టణంలోని జామీయ మసీదుకు చెందిన రెండెకరాలు 15 గుంటల పట్టా భూమిని వక్ఫ్‌బోర్డులో తప్పుగా నమోదు చేశారని, అధికారులు వెంటనే దాన్ని తొలగించి పట్టా భూమిగా మార్చాలని సోమవారం ప్రజావాణిలో కమిటీ సభ్యులు వినతి పత్రం అందించారు. జామీయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ధరణి పేరుతో రెవెన్యూ అధికారులు తప్పిదం చేసి జామియా మసీద్ భూమిని వక్ఫ్‌బోర్డులో కలిపినట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని పలుమార్లు ప్రజావాణిలో, కలెక్టర్‌కు విన్నవించినట్లు పేర్కొన్నారు. మసీద్ కమిటీ సభ్యులు తౌఫిక్, అఖ, మైనొద్దీన్, పలువురు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 11వ, వార్డుకు చెందిన బిక్కరి శాంతమ్మ మరణించడంతో ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చందర్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, నాయకులు ఉన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. ఎంపీపీ కృష్ణానాయక్ అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైంది. అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదిలు సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ పాండునాయక్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

అంగన్‌వాడీలో అన్న ప్రాసన

వీపనగండ్ల: మండలంలోని సంపత్‌రావుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పసిపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోయే రోజుల్లో పిల్లలు విద్యలో రాణించాలన్న సంకల్పంతోనే చిన్నారుల తల్లిదండ్రులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అంగన్‌వాడీ టీచర్ వెంకటేశ్వరమ్మ తెలిపారు. కార్యక్రమంలో పలువురు చిన్నారుల తల్లులు, హెల్పర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగులపంచమి



కానాయపల్లి కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పెబ్బేరులో నాగులకు పాలు పోస్తున్న మహిళలు

కొత్తకోట రూరల్: నాగపంచమి సందర్భంగా మండలంలోని కానాయపల్లి శివారులో శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నాగదేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు నాగపంచమి వేడుకలు నిర్వహించారు.
పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని నాగుల చవితి వేడుకలను భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, పురుషులు నూతన వస్త్రాలు ధరించి నాగులకు పూజలు చేసి పాలు, నైవిద్యం సమర్పించారు. ఆనంతరం శ్రావణ సోమవారం ఆలయాల్లో స్వాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు.
శ్రీరంగాపురంలో..
పెబ్బేరు రూరల్: శ్రీ రంగాపురం మండల కేంద్రంలో నాగుల పంచమి వేడుకలు మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సోమవారం పొద్దున్నే పుట్టల వద్ద చేరుకొని పాలు పోసి నైవేద్యం సమర్పించారు. నాగుల చవితి సందర్భంగా శివాలయాలు, నాగదేవత ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.
భక్తిశ్రద్ధలతో..
ఆత్మకూర్: పట్టణంలోని శ్రీబాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పుట్టలో పాలు పోసి, నైవేద్యాలు సమర్పించారు. మండలంలోని గ్రామాల్లో నాగుల పంచమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నాగదేవతల విగ్రహాల ప్రతిష్ఠ



వడ్డెవాటలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని వడ్డెవాటలో నాగపంచమి సందర్భంగా సోమవారం గ్రామ శివారులోని ఊర చెరువు కట్టపై నాగదేవతల విగ్రహాలు ప్రతిష్ఠించారు. నాగదేవతల విగ్రహాల ప్రతిష్ఠకు బంధువులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్య, ఉప సర్పంచ్ గోకరమ్మ, గ్రామ పెద్దలు లక్ష్మీకాంత్‌రెడ్డి, చిన్నారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మండ్ల రవి నాయుడు, సాయిలు, వెంకటేష్ నాయుడు, రాజు, రాములు పాల్గొన్నారు.

పాములపై..
పెబ్బేరు రూరల్: నాగుల చవితి సందర్భంగా వనపర్తి పట్టణంలోని బ్రహ్మంగారి గుడి ఆవరణలో నాగ ప్రతిష్ఠ విగ్రహాలకు పాలు పోయడానికి వచ్చిన భక్తులకు స్నేకు సొసైటీ అధ్యక్షులు కృష్ణసాగర్ పాములపైన అవగాహన కల్పించారు. వాటి విశిష్ఠత గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో బులియన్ మర్చట్ అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి శ్యాంసుందర్‌చారి, అర్చకులు పాల్గొన్నారు.

కరెంటు లేక అవస్థలు



కోదండ రామస్వామి ఆలయం వద్ద నీటికోసం బారులు తీరిన విద్యార్థులు

గోపాల్‌పేట: మండల కేంద్రంలో కరెంట్ అంతరాయం ఏర్పడడంతో ప్రజలు, వ్యాపారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మీసేవ కేంద్రాల వద్ద ఆయా పనులు కోసం వచ్చిన ప్రజలు పడిగాపులు కాశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, 800 మంది పాఠశాల, కళాశాల విద్యార్థులు తాగునీరు, వాడుకునే నీరు లేక అవస్థలు పడ్డారు. కోదండ రామస్వామి ఆలయం వద్ద ఉన్న స్టోరేజీ ట్యాంకు నీటిని తాగి, ప్లేట్లు కడుక్కున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు పోయిన కరెంటు మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చింది. ఈ విషయంపై గోపాల్‌పేట ఏఈ హర్షవర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా వనపర్తి సబ్‌స్టేషన్‌లో సమస్య తలెత్తిందని, సమస్యను పరిష్కరించడానికి సమయం పట్టిందని తెలిపారు.

బోనాలతో వినూత్న నిరసన

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ కార్యాలయం ఆవరణలో రెండో ఏఎన్‌ఎంలు 6వ రోజు బోనాలతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. దీక్షా శిబిరం నుంచి బోనాలు ఎత్తుకొని నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి కోట మైసమ్మకు బోనం సమర్పించి, తమ డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అమ్మవారికి సమర్పించారు. వారికి ఏఐటీయూసీ, ఏఐఎస్‌ఎఫ్, సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్, కార్యదర్శి మోష, ఏఐఎస్‌ఎఫ్ డివివిజన్ కార్యదర్శి వంశీ, సీపీఐ నాయకులు రమేష్, ఏఎన్‌ఎంల సంఘం నాయకులు కృష్ణవేణి, లక్ష్మమ్మ, సుమిత్ర, పార్వతి, రాధ, శ్రీదేవి, శారద, లావణ్య, లలిత పాల్గొన్నారు.



బోనాలతో ర్యాలీగా వెళ్తున్న రెండో ఏఎన్‌ఎంలు

ఈవీఎంలపై అవగాహన



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

పెబ్బేరు రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగంపై సోమవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మి మాట్లాడుతూ రానున్న రెండు, మూడు నెలల్లో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయని, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి మండంలోనూ ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో 191,192,193,194,195,196 ప్రతి పోలింగ్ బూత్‌లలో ఓటు ఎలా వేయాలో, అభ్యర్థి ఎలా చూసుకోవాలో ఓటర్లకు మిషన్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, ఆర్‌ఐ రాఘవేంద్రరావు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చంద్రఘడ్‌కు పోటెత్తిన భక్తులు



అమరచింత: నాగపంచమిని పురస్కరించుకోని మండలంలోని అత్యంత పురాతన చంద్రఘడ్ కోటపై నాగలింగేశ్వర స్వామి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు మండలంలోని ప్రజలే కాకుండా జిల్లాలోని ఇతర పట్టణాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. సర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డితో పాటు ఆయల కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

గిరిజనుల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం

కొత్తకోట రూరల్: గిరిజనుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందని వనపర్తి నియోజవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూర్ ప్రమోద్‌రెడ్డి అన్నారు. పెద్దమందడి మండలంలో గిరిజన బంజారాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ గిరిజనులు ముంబాయి, దుబాయ్ వంటి ప్రాంతాలకు వలసలు వెళ్లేవారని, ప్రత్యేక రాష్ట్రంలో గిరిజనుల కోసం కేసీఆర్ చేపట్టిన పథకాలు చూసి మళ్లీ స్వస్థలాలకు వస్తున్నారన్నారు. మరోసారి సీఎంగా కేసీఆర్ అయితేనే బంగారు తెలంగాణ సాధ్యమౌతుందన్నారు. గోపాల్‌నాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గౌడనాయక్, జానకీరాములు, సేనాపతి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గిరిజను ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న వంగూర్ ప్రమోద్‌రెడ్డి

బోర్‌వెల్ యూనిట్ ఏర్పాటు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అంకాయపల్లి తండాలో గిరిజనులకు ట్రైబల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా 'మా తోట' కార్యక్రమంలో భాగంగా మామిడి మొక్కలను పంపిణీ చేశారు. తోటల సాగుకు నీటి సౌకర్యం కోసం రైతులకు బోర్లు తవ్వడానికి బోర్‌వెల్ యూనిట్‌ని నాబార్డ్ సీజీఎం సుశీల ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీడీఎం షణ్ముఖ, అఖిల, రాంకి ఫౌండేషన్ అధ్యక్షుడు యంబి.రామిరెడ్డి, ఫైనాన్స్ కార్యదర్శి శ్రావణి, చిదంబర్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న కిల్లె గోపాల్

- సీపీఎం రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్

పాన్‌గల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనట్లు సీపీఎం రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్, ఎండీ జబ్బార్ అన్నారు. సోమవారం పాన్‌గల్ మండలం రేమద్దులలో పార్టీ రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి వంటి హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. దేశంలో అనేక మంది పేద ప్రజలు ఆకలితో అల్లాడుతున్నారన్నారు. అకలి తీర్చేందుకు పాలకులు ఆలోచించకపోవడం దారుణమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుల, మత రాజకీయాల వైపు మళ్లించడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలోని తెలంగాణ ప్రభుత్వం పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి వాటిని విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దేవేందర్, భగత్, వెంకటయ్య, ఖాజా, మల్లేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఆపదొస్తే '1098'ను సంప్రదించాలి

వనపర్తిటౌన్: బాలబాలికలకు ఏదైన ఆపదొస్తే 1098 నంబర్‌ను సంప్రదించాలని చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శైలజ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బాలరక్షక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పుట్టగానే తల్లి ప్రేమకు దూరమై, కన్నవారు దూరమై అనాథలుగా మారుతున్నవారు, అమ్మానాన్నలు మందలించారని ఇళ్ల నుంచి వెళ్లిపోయి ఉంటున్న అభాగ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఆపన్నహస్తం అందిస్తుందన్నారు. తాజాగా సఖి కేంద్రం తరహాలో నిరంతరాయంగా సేవలు అందించేందుకు బాలరక్షక్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మరణించిన వృద్ధులకు వారి స్థానంలో భార్యను పింఛన్ కోసం దరఖాస్తు చేయించాలన్నారు. 26న కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో వెయ్యి మొక్కలు నాటేందుకు స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. దీంతో పాటు హర్ ఘర్‌కే తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలను పంపిణీ చేయించాలన్నారు. పల్లె ప్రకృతి వనాలలో జామ, ఉసిరి, చింత, మర్రి, రాగి వంటి మొక్కలను నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అయిల్‌ఫామ్ తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి, ఎక్కువ మొత్తంలో నాటుకునేలా చూడాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య పాల్గొన్నారు.

షోయబుల్లా ఖాన్ ఆశయాలను సాధిద్దాం

పెబ్బేరు రూరల్: జర్నలిస్టు షోయబుల్లాఖాన్ ఆశయాలను సాధించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని అజాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జబ్బార్ అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో సీపీఎం కార్యాలయంలో అమరజీవి షోయబుల్లా ఖాన్ 75వ వర్ధంతి సందర్భంగా పలువురు నాయకులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమలో పరమేశ్వరచారి, సాయిలీల, సుగుణమ్మ పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలో నూతన గ్రామ పంచాయతీ చిలకటోనిపల్లిలో రేషన్ దుకాణాన్ని సోమవారం జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, సర్పంచ్ జానమ్మలు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేణుయాదవ్, పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజాప్రకాష్‌రెడ్డి, ఆర్‌ఐ తిరుపతయ్య, శ్రీనివాసులు,వెంకటేష్,రాములు ఉన్నారు.

కేసీఆర్‌తోనే రాష్ట్రం సుభిక్షం



గోపాల్‌పేటలో పటాకులు పేల్చి సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆత్మకూర్: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ప్రతి ఒక్కరి సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక గాంధీచౌక్‌లో మక్తల్ నియోజకవర్గానికి చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి టికెట్ కేటాయించడంతో సంబరాలు నిర్వహించారు. పటాకులు కాల్చి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, చైర్ పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ బంగారు శ్రీను, మాజీఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్‌ఏ రాజు, వైస్‌ఎంపీపీ కోటేష్, రైతు సంఘం అధ్యక్షుడు వీరేషలింగం, కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.
ఖిల్లాఘనపురం: వనపర్తి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి టికెట్ కేటాయించడంతో మండల కేంద్రంలో నాయకులు సంబురాలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాళ్ళకృష్ణయ్య, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
అమరచింత: మక్తల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా మరోమారు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి కేటాయించడంతో బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. పటాకులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్‌ఏ రాజు, నాయకులు రమేష్ ముదిరాజ్, అక్కల నరసింహులు గౌడ్, బాలరాజ్, నాగభూషణం గౌడ్, కమలాకర్ గౌడ్, పలువురు పాల్గొన్నారు.
వనపర్తిలో నిరంజన్‌రెడ్డి గెలుపు ఖాయం
గోపాల్‌పేట: రాబోయే ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గంలో నిరంజన్‌రెడ్డి గెలవడం ఖాయమని, కేసీఆర్ మరోసారి సీఎం కావడం ఖాయమని బీఆర్‌ఎస్ మండల నాయకులు అన్నారు. సోమవారం సీఎం కేసీఆర్ నియోజకవర్గాల అభ్యర్థుల జాబితాను ప్రకటించడంతో పటాకులు పేల్చి సంబరాలు చేశారు. కార్యక్రమంలో వంగూరు ప్రమోద్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు తిరుపతి యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోదండం, గోపాల్‌పేట సర్పంచ్ శ్రీనివాసులు, కోటిరెడ్డి పాల్గొన్నారు.

చేనేత కార్మికుల అభివృద్ధే నాబార్డ్ లక్ష్యం

అమరచింత: చేనేత కార్మికులు వృత్తిలో రాణిస్తూ తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ చీరల తయారీతో ఆర్థికంగా ఎదిగేందుకు నాబార్డ్ ఎంతో చేయూతనిస్తోందని సీజీఎం సుశీల అన్నారు. అమరచింత చేనేత ఉత్పత్తిదారుల సంఘం ద్వారా పట్టణంలో చేనేత వస్త్రాల మార్కెటింగ్ షాప్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో చేనేత కార్మికులు యాజమాన్యం ద్వారా ముడిసరుకులు పొంది చీరలను తయారు చేసి వారు ఇచ్చిన వేతనాలతో జీవనం గడిపేవారన్నారు. కాల క్రమంలో చేనేత వస్త్రాలకు ఆదరణ కరువైందన్నారు. కార్మికులకు తగిన వేతనాలు ఇవ్వక పోవడంతో నాబార్డ్ చేనేత కార్మికులను ఆదుకునేందుకు ముందుకొచ్చిందన్నారు. ఈ క్రమంలో కార్మికులు తయారు చేసిన వస్త్రాలను విక్రయించేందుకు ప్రత్యేకంగా మార్ట్ కావాలని నాబార్డ్ ఆర్థిక భరోసాతో ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాబార్డ్ ఆర్‌ఓ, సిబ్బంది డీడీఎం శణ్ముక చారి, అఖి, శ్రావణ్ కుమార్, జ్యోతి, రాజ్‌కుమార్, లక్ష్మి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.




అమరచింతలో చేనేత వస్త్రాల మార్ట్‌ను ప్రారంభిస్తున్న సీజీఎం

స్వీపర్లకు కాంగ్రెస్ మద్దతు

వనపర్తిటౌన్: ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్లకు రూ.1600 జీతం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కేవలం రూ.4వేల జీతం ఇస్తూ వారిని అన్యాయం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో దీక్ష చేపడుతున్న స్వీపర్లకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలి



మల్లాయిపల్లిలో జెండాను ఎగురవేస్తున్న కర్ణాటక ఎమ్మెల్యే రాజేష్‌నాయక్

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్న, నియోజకవర్గానికి పరిశ్రమలు రావాలన్న, యువతకు ఉపాధి అవకాశాలు లభించాలన్న ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కర్ణాటక రాష్ట్రం బంత్వాల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రాజేష్‌నాయక్ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లితండా, మల్లాయిపల్లి గ్రామాల్లో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా ఐకమత్యంతో పనిచేస్తూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో పార్టీలు మారిన జూపల్లి, ఎమ్మెల్యే బీరంను తరమికొడితేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. అంతకుముందు మల్లాయిపల్లిలో బీజేపీ జెండాను ఎగురవేసి, గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రామన్‌గౌడు, రోజారమణి, అన్వేష్, మోహన్‌నాయక్, జగన్‌గుప్తా, వెంకటేష్‌యాదవ్, శివరాం, మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయండి

మదనాపురం: తెలంగాణలో బీజేపీ తిరుగులేని శక్తిగా ఉందని, ప్రతి కార్యకర్త బూత్ లేవల్‌లో పని చేస్తే బీఆర్‌ఎస్ ఓటమి ఖాయమని కర్ణాటక ఎమ్మెల్సీ తేజశ్విని అన్నారు. సోమవారం మదనాపురం మండలంలోని దంతనూరు ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రవాస్ యోజన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.
ఖిల్లాఘనపురం: తెలంగాణలో అవినీతి పాలనను అంతమొందించేందుకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని కర్ణాటక రాష్ట్రం బేలూరు ఎమ్మెల్యే జీకే సురేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప ద్మశాలి కల్యాణమండపంలో ప్రవాస్‌యోజన కార్యక్రమం నిర్వహించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు

వనపర్తిటౌన్: పెండింగ్‌లో ఉన్న రూ.5,177 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం. ఆది డిమాండ్ చేశారు. ఈనెల 17వ, తేదీ నుంచి 21వ, తేదీ వరకు చేపట్టిన జీపు యాత్రలో వచ్చిన విద్యార్థుల సమస్యలపై సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వందలాది మంది విద్యార్థులు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అద్దె భవనాల్లో ఉన్న గురుకులాలకు, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, నూతనంగా ఏర్పడిన చిన్నంబావి, రేవల్లి, అమరచింత, మదనాపురం మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీపనగండ్ల ఎస్సీ గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించి అమడబాకుల నుంచి వీపనగండ్లకు తరలించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి, సహాయ కార్యదర్శి రాఘవ, కమిటీ సభ్యులు కుమార్, యుగంధర్, అవినాష్, మల్లేష్, ప్రసాద్, ఈశ్వర్, మహేష్ పాల్గొన్నారు.

24న బద్రోద్దీన్ షావలి దర్గా ఉర్సు

ఖిల్లాఘనపురం: మండలంలోని తిర్మలాయపల్లి శివారులో వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రధాన రహదారి పక్కన ఉన్న షేక్‌షావలి దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు ముతవల్లి బద్రోద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న గంధం కార్యక్రమం ముతవల్లి ఇంటి నుంచి ఊరేగింపుగా దర్గా దగ్గరకు చేరుతుందని తెలిపారు. మరుసటి రోజున ఉర్సు పెద్ద ఎత్తున ఉంటుందని పేర్కొన్నారు.